క్లుప్తంగా

కొనకనమిట్ల కార్యదర్శికి సన్మానం



రాజకుమారిని సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కొనకనమిట్ల: సుపరిపాలన విభాగంలో జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు అందుకున్న కొనకనమిట్ల కార్యదర్శి కె.రాజకుమారిని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం కొనకనమిట్లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ దుకాణాల వేలం

మార్కాపురం టౌన్: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో నిర్మించనున్న మార్కెట్ దుకాణాలకు గుడ్ విల్ పద్ధతిలో బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ గిరికుమార్ తెలిపారు. అలాగే కూరగాయల మార్కెట్ స్థానంలో నిర్మించనున్న కమర్షియల్ కాంప్లెక్స్ వేలాన్ని వాయిదా వేసినట్లు చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ధరావత్తు రూ.1.50 లక్షలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కూలిన ట్రాన్స్‌ఫార్మర్

యర్రగొండపాలెం: స్థానిక ఎస్‌బీఐకు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం కూలింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎదురుగా ఉన్న చెట్టు కొమ్మలు గాలికి ఊగుతూ విద్యుత్ తీగలకు తగులుతుండటంతో ఆ శాఖాధికారులు వాటిని తొలగించే క్రమంలో ఒక్కసారిగా పెద్ద కొమ్మ తీగలపై పడింది. దీంతో 3 విద్యుత్ స్తంభాలు కిందపడ్డాయి. ఆ స్తంభాలకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కూలింది. పెను ప్రమాదం తప్పిందని ఆ ప్రాంతం ప్రజలు తెలిపారు. వెంటనే ఏఈ శ్రీనివాసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయించారు.

గిరిజన గూడేల్లో వైద్యశిబిరం



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: మండలంలోని పాలుట్ల పీహెచ్‌సీ పరిధిలోని గిరిజన గూడేల్లో సార్ద్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అల్లిపాలెం, గాంధీనగర్, శాంతి నగర్, దద్దనాల చెంచు గూడేల్లో ఉన్న గర్భిణులు, చిన్నపిల్లలకు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సార్ద్ సంస్థ ఏపీఎం ఎన్ఎం కృష్ణ, ఏఎస్ఎస్‌వో మరియబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి



నివాళులర్పిస్తున్న ప్రాజెక్టు అధికారి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని తుమ్మలబైలు గిరిజన గూడెంలో ఏర్పాటు చేసిన గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడెంలో ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమరయోధులు కుడుముల హనుమంతప్ప, కుడుముల పెద్ద బయ్యన్నల విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమరయోధుల త్యాగాలను అందరూ స్మరించుకోవాలన్నారు. కుడుముల మూగెన్న, భూమని మంతన్న, శ్రీనునాయక్, గూడేనికి చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవం

చినగంజాం: పర్చూరు మండలం నూతలపాడులో వేంచేసియున్న పోలేరమ్మ తల్లి శిడిమానుత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ శిడి 53వ వార్షికోత్సవం సందర్భంగా నూతలపాడు గ్రామంలో పోలేరమ్మ అమ్మ వారి శిడిమాను ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. పర్చూరు ఎస్సై ఎన్‌సీ ప్రసాద్ అవాంఛనీయ ఘటలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



మార్కాపురం: ర్యాలీకి హాజరైన వైద్య సిబ్బంది



గిద్దలూరులో..



దర్శిలో..

- డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ రాహుల్

మార్కాపురం: దోమలు పుట్టకుండా చర్యలు చేపడితే మలేరియా, చికున్‌గున్యా, డెంగీ, ఫైలేరియాసిస్, మెదడువాపు లాంటి వ్యాధులను నివారించవచ్చని మార్కాపురం డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా మున్సిపల్, వైద్యారోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ మాట్లాడుతూ.. నీరు నిల్వ చేసే పాత్రలపై మూతలు పెట్టాలని, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, వాడని రోళ్లు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రావణ్‌తేజ, హర్షవర్ధన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు నాగేంద్రరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీరో మలేరియాకు సమయం ఆసన్నం

పొదిలి: వైద్య రంగంలో నూతన ఆవిష్కరణల ద్వారా మలేరియాను నివారించే సమయం ఆసన్నమైందని స్థానిక సామాజిక వైద్యశాల అధికారి డాక్టర్ చక్రవర్తి చెప్పారు. ఉప్పలపాడు పీహెచ్‌సీ, పొదిలి సీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెద్ద బస్టాండ్, చిన్నబస్టాండ్ మీదుగా దర్శి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు టి.సుష్మ,సుగుణ కుమార్, సబ్ యూనిట్ అధికారి బ్రహ్మానందం, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు ఎస్.శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సింధూజ ఆధ్వర్యంలో ధారావి, చైతన్య కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులతో తర్లుపాడులో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతిభ, సీహెచ్‌ఓ తులసి ప్రసాద్, సిబ్బంది విజయ, నగేష్, అనిల్, ప్రిన్సిపాల్ తులసి తదితరులు పాల్గొన్నారు.

దోమల ఆవాసాలపై అవగాహన

తాళ్లూరు: గ్రామాల్లో దోమల ఆవాసాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకునే విధంగా ఆరోగ్య కార్యకర్తలు కృషి చెయ్యాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ ఖాదర్ మస్తాన్‌బీ కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ ఖాదర్ మస్తాన్‌బీ మాట్లాడుతూ దోమలతో విషజ్వరాలు సోకి గతంలో పడిన ఇబ్బందులను గమనించాలని, మరోసారి ఆ విధంగా కాకుండా కృషి చెయ్యాల్సిన ఆవశ్యకతను వివరించారు. సీహెచ్‌ఓ ప్రమీల, హెచ్‌ఈఓ కె.శ్రీనివాసులు, హెల్త్ విజిటర్ కోటేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

గిద్దలూరు రూరల్: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలని డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ అన్నారు. మండలంలోని కృష్ణంశెట్టిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం భ్యారీ ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో షేక్ ముంతాజ్, రంగనాయకులు, రమేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్శి: జీరో మలేరియా సమాజమే లక్ష్యంగా పని చేయాలని డాక్టర్ కేవీ శ్రీనివాసులు సూచించారు. మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మలేరియా వ్యాధి లక్షణాలు, నివారణపై తీసుకోవాల్సిన చర్యలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ చలి, జ్వరం, వణుకు, ఒళ్లు నొప్పులు లక్షణాలు ఉన్నప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదిస్తే ఉచితంగా రక్త పరీక్షలు చేస్తారని చెప్పారు. డాక్టర్ స్పందన, ఎంపీహెచ్ఈఓ ఎస్కే అబూసాలేహ, హెచ్‌వీ మరియమ్మ, ల్యాబ్‌టెక్నీషియన్ వసంత్‌కుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: గృహాల్లో వారానికి మించి నీరు నిల్వ ఉంచొద్దని వైద్యాధికారి పృథ్వీరాజ్ అన్నారు. మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. గృహ పరిసరాలు, ఖాళీ కొబ్బరిబొండాలు, కూలర్‌లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు ఉపయోగించాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ అధికారి హబీబ్ ఖాన్, పర్యవేక్షకుడు రవీంద్రబాబు, సిబ్బంది సామ్రాజ్యం, వెంకటమ్మ, కళావతి, లక్ష్మీదేవి, కాశీవిశ్వనాథరావు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కరపత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ చెన్ను విజయ



కరపత్రాలు అందిస్తున్న ఇస్మాయేల్

అర్ధవీడు (కంభం): పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మిట్టమీదపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఆమె పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలకు అర్హతే కొలమానంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. గ్రామంలోని ప్రతి గడప వద్దకు వెళ్లి కరపత్రాలు అందించి స్టిక్కర్లు అంటించారు. ఎంపీటీసీ అనంతరావు, వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మరియమ్మ పాల్గొన్నారు.

జగనన్నతో అభివృద్ధి సాధ్యం

మార్కాపురం: రాష్ట్ర అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 16వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గడిచిన నాలుగేళ్లలో మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మార్కాపురం టౌన్‌లో నీటి సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి రూ.22 కోట్లతో పనులు చేయిస్తున్నారని, అన్ని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు. మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తైతే ఆధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రంగలక్ష్మి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారివేముల బాబి పాల్గొన్నారు. పలు గృహాలకు స్టిక్కర్లు అంటించి కరపత్రాలు పంపిణీ చేశారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కిరణ్‌గౌడ్

యర్రగొండపాలెం: మండలంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎండలు తీవ్రంగా కాస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఎక్కువ నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పార్టీలకు అతీతంగా అధికారులు పరిష్కరించాలని, ఆ సమస్యలు పెద్దవి అయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఆ సదస్సుకు డాక్టర్లతో పాటు తాము కూడా పాల్గొంటామన్నారు. మండల ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, కో ఆప్షన్ సభ్యుడు విజయకుమార్‌తో పాటు పలువురు సభ్యులు సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజభాస్కర్, హౌసింగ్ డీఈ ఎస్వీ సురేష్ బాబు, హెచ్‌వో పి.ఆదిరెడ్డి, ఏవో పి.వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు ఎం.శ్రీనివాసరావు, మంత్రూనాయక్, ఏఈలు శ్రీకాంత్, మహంకాళయ్య, అంజిరెడ్డి, ఉపాధి ఈసీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్యుల జయంతి



పూజల అనంతరం చైర్మన్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



పూజలు చేస్తున్న సుబ్బయ్య శాస్త్రి దంపతులు

మార్కాపురం: శంకర జయంతి ఉత్సవాలను మంగళవారం మార్కాపురం పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలోని జగద్గురు ఆదిశంకరచార్య ఉపాలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శంకర జయంత్యుత్సవాలు ముగిశాయి. చివరిరోజున స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, గణపతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ సమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, శివాలయం చైర్మన్ వాలిచర్ల కేశవరావు, గౌరవాధ్యక్షుడు గోపాలుని హరిహరరావు, సోమయాజుల సుబ్బశాస్త్రి, హరిప్రసాద్, భాస్కర్, రిటైర్డ్ తహసీల్దార్ సుబ్బారావు, వెలుగొండ ప్రాజెక్టు డీటీ మల్లికార్జున్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ, ఆడిటర్ నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శంకర జయంతి

కురిచేడు: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలవకొలను సుబ్బరామయ్యశర్మ ఇంట్లో ఏటా జయంతి చేస్తారు. ఈ ఏడాది కూడా శంకర జయంతి ఉత్సవాలను ఆయన కుమారులు సుబ్బయ్యశాస్త్రి, వెంకటసుబ్రహ్మణ్యశర్మలు వేదమంత్రోచ్ఛరణల మధ్య చేశారు. పూజా కార్యక్రమాలను విశ్వనాథశాస్త్రి, శేషఫణిశర్మలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. బ్రాహ్మణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కేవీ నాగరాజు, గ్రామంలోని బ్రాహ్మణులు పాల్గొన్నారు.

వలంటీర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. ఐదు వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. తురకపాలెంలో రెండు ఎస్సీ, ఎస్సీ (మహిళ), మన్నేపల్లి ఒకటి (ఓసీ), శివరామపురం రెండు బీసీ (మహిళ)కు రిజర్వ్ చేసినట్లు పేర్కొన్నారు. సంబంధిత క్యాటగిరీకి చెందిన వారు బుధవారం నుంచి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మే ఒకటిన దరఖాస్తులు పరిశీలిన చేసి మే 3న ఇంటర్వ్యూలు నిర్వహించి 4వ తేదీన శిక్షణ, ఐదో తేదీన విధుల్లో చేరాల్సి ఉంటుందని వివరించారు.

కొనకనమిట్లలో కూడా..

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న 10 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జనార్దన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గొట్లగట్టు పరిధిలో క్లస్టర్ 11 ఎస్సీ, చినారికట్ల క్లస్టర్ 14 ఓసీ, గరిమినపెంట క్లస్టర్ 24 ఓసీ ఉమెన్, నాగరాజుకుంట క్లస్టర్ 3 బీసీ, పెదారికట్ల క్లస్టర్ 4 ఓసీ, ఎదుర్రాళ్లపాడు క్లస్టర్ 10 ఎస్సీ ఉమెన్, క్లస్టర్ 14 బీసీ, రేగుమానిపల్లి క్లస్టర్ 8 ఎస్టీ, నాగంపల్లి క్లస్టర్ 4 బీసీ, మునగపాడు క్లస్టర్ 5 ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హులైన వారు ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 2వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించి, అర్హులకు 4న శిక్షణ ఇస్తామని, 5న నియామక పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

మౌలిక వసతులు యాప్‌లో పొందుపరచాలి

దర్శి: పాఠశాలల్లో మౌలిక వసతులను యాప్‌లో పొందుపరచాలని ఎంఈఓ కాకర్ల రఘురామయ్య సూచించారు. స్కూల్ ఫెర్ఫార్మెన్స్ టూల్‌పై ఒక రోజు శిక్షణ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రఘురామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటే సమస్యలు యాప్‌లో పేర్కోవడం అవసరమన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు రవీంద్ర, శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా విశ్లేషించేందుకు ఉపయోగ పడే విధానమే మూల్యాంకణమన్నారు. ఖాదర్ మస్తాన్, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ఎంపీటీసీగా రవికుమార్



సన్మానం అందుకుంటున్న ఎంపీటీసీ రవికుమార్

అర్ధవీడు (కంభం): మండలంలో ఉత్తమ ఎంపీటీసీగా నన్నెబోయిన రవికుమార్ ఎంపికయ్యారు. ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆడిటోరియమ్‌లో మంగళవారం జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం, నేషనల్ లోకల్ గవర్నమెంట్ చాంబర్ ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ్య సాధన సమితి అధ్వర్యంలో ఉత్తమ ఎంపీటీసీగా నన్నెబోయిన రవికుమార్‌ను ఎంపిక చేసి ఆయన్ను సన్మానించారు. అనంతరం ఉత్తమ సేవ పురస్కారాన్ని సర్పంచ్‌ల సంఘ ప్రధాన కార్యదర్శి వీరభద్రాచారి చేతులు మీదుగా బహూకరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎల్ఐసీ ఏజెంట్ కోటా శ్రీను మంగళవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు.. కోటా శ్రీను కుటుంబాన్ని పరామర్శించి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు.

నిమ్మగడ్డి సాగుతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానాధికారి రమేష్

మార్కాపురం టౌన్: నిమ్మగడ్డి సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని మార్కాపురం ఉద్యాన శాఖాధికారి రమేష్ పేర్కొన్నారు. ఆరోమ మిషన్ ఫేజ్-3లో భాగంగా మంగళవారం రాయవరం, నాయుడుపల్లి గ్రామాల్లో నిమ్మగడ్డి పండించే రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సుగంధ ద్రవ్యాల సాగులో పరివర్తనాత్మక మార్పులు వచ్చాయని, రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఉన్నత స్థాయి శాస్త్రవేత్తలతో మే రెండో వారంలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి పావణేశ్వరి పాల్గొన్నారు.

మోదీ నిర్ణయాలతో దేశంలో సంక్షోభం



మాట్లాడుతున్న రమాదేవి

మార్కాపురం: ఇచ్చిన హామీలు మరిచి దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పట్టణంలోని అమ్మవారి శాల బజారులో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014లో అధికారంలోకి వచ్చేందుకు దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను మోదీ మరిచిపోయారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, సీపీఎం కార్యదర్శి సోమయ్య, వామపక్ష నాయకులు రమేష్, బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పాదరక్షలు అందిస్తున్న హరిహరరావు

మార్కాపురం టౌన్: పట్టణంలోని నెహ్రూ బజార్‌లో షిర్డీసాయి మందిరం 28వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాబా విగ్రహానికి అభిషేకాలు, హోమం నిర్వహించారు. సుమారు 300 మందికి అన్నదానం చేశారు. మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో భాగంగా భక్తులకు అన్నదానంతో పాటు 50 మంది పేదలకు పాదరక్షలు అందించినట్లు తెలిపారు.

హనుమంత వాహనంపై చెన్నకేశవస్వామి



ముస్తాబైన చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామివారు హనుంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయదాతలుగా కోడూరి, బొర్రా కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల



కల్యాణానికి హాజరైన ఎంపీపీ దంపతులు, భక్తులు

దొనకొండ: స్థానిక అడ్డరోడ్డు ఆనంద ఆశ్రమంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ తిరునాళ్ల మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. దాతల సహకారంతో వీరబ్రహ్మేంద్ర స్వామి నవమ వార్షికోత్సవం వైశాఖ శుద్ధ పంచమి రోజు జరుపుకుంటున్నారు. గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, ఈశ్వరీదేవి, సిద్ధమూర్తి, అన్నపూర్ణ, కాశీ విశ్వేశ్వర, నందీశ్వర, సీతా సమేత శ్రీరామ చంద్రమూర్తి, లక్ష్మణ అభయాంజనేయస్వామి, పోలేరమ్మ, కాశినాయన, ఆదిత్యాది నవగ్రహ దేవతల నవమ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి దంపతులు స్వామి వారి కల్యాణం జరిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బైరవానందస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నేడు, రేపు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలు

పెద్దారవీడు: ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కోసం 26, 27వ తేదీల్లో మండలంలో నాలుగు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాసర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 26వ తేదీన పుచ్చకాయలపల్లె సచివాలయంలో సుంకేసుల, కలనూతల, పుచ్చకాయలపల్లె, గొబ్బూరు సచివాలయంలో దేవరాజుగట్టు, గొబ్బూరు, 27వ తేదీన బద్వీడుచెర్లోపల్లె సచివాలయంలో పెద్దారవీడు, సానికవరం, బి.చెర్లోపల్లె, తోకపల్లె సచివాలయంలో తోకపల్లె, తంగిరాలపల్లె, కంభంపాడు, మద్దలకట్ట, బోయిదగుంపుల, చట్లమిట్ట గ్రామాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు పని చేస్తాయని, ఆధార్ కేంద్రాల్లో నమోదు చేసే అంశాలు 0-5 ఏళ్ల పిల్లలకు ఆధార్ కార్డు నమోదు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫొటో, ఈ మెయిల్ మార్పు చేయుట, ఫోన్ నంబర్ లింక్, వేలిముద్రను అప్‌డేట్, కలర్ ప్రింట్ డౌన్‌లోడ్ చేయడం లాంటివి చేసుకొనే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.